ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పెద్దపల్లి జిల్లా వార్తలు
3★
సోమవారం 19 ఆగస్టు 2024



నేడు రక్షాబంధన్

- అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల అనురాగానికి ప్రతీక
- రాఖీలు కట్టేందుకు సిద్ధమవుతున్న అక్కాచెల్లెళ్లు
- జిల్లాలో కిటకిటలాడుతున్న రాఖీ, స్వీట్స్ దుకాణాలు

కోల్‌సిటీటౌన్, ఆగస్టు 18: అన్నాచెల్లెళ్ల, అక్కాతమ్ముళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రక్షబంధన్ పర్వదినం సోమవారం జరుగనున్నది. శ్రావణ మాసంలో పౌర్ణమి రోజున వచ్చే రక్షాబంధన్ పండుగకు ప్రత్యేకత ఉంది. దీనినే కొన్ని ప్రాంతాలలో జంధ్యాల పౌర్ణమి అని కూడా అంటారు. ఈ పండుగ అన్నా చెల్లెళ్ళ అనుబంధానికి ప్రతీకగా నిలుస్తుంది. భారతీయ సనాతన సంప్రదాయంలో ఈ పండుగకు ప్రాధాన్యం సంతరించుకుంది. అన్న గానీ, తమ్ముడు గానీ మహోన్నత స్థానానికి ఎదగాలని, కలకాలం చల్లగా ఉంటూ తనకు రక్షగా ఉండాలని కోరుకుంటూ సోదరి కట్టేదే ఈ రాఖీ. అలాగే యజ్ఞోపవీతానికి(జంధ్యానికి) ఉన్న ప్రాధాన్యాన్ని అనుసరించి జంధ్యాల పూర్ణిమ అని కూడా పిలుస్తారు. పాతది వదిలి కొత్తదానిని ధరస్తారు. ఉపనయనం అయిన వారు జంధ్యాల పౌర్ణమి రోజున గాయత్రీ పూజచేసి కొత్త యజ్ఞపవీతాన్ని ధరించి పాతది తీసివేస్తారు.



జిల్లాలో జోరుగా రాఖీల కొనుగోళ్లు..

జిల్లాలో వారం రోజుల నుంచే రాఖీల కొనుగోళ్ల సందడి మొదలైంది. జిల్లాలోని పెద్దపల్లి, గోదావరిఖని, సుల్తానా బాద్, ఎన్‌టీపీసీ, రామగుండం తదితర పట్టణ, మండల కేంద్రాలలో రాఖీల కొనుగోళ్లు జోరందుకున్నాయి. సోమవారం పండుగ కావడంతో ఈ కొనుగోళ్లతో రాఖీల దుకాణాలు, స్వీట్ హౌజ్ దుకాణాలు కిక్కిరిసిపోయాయి. కాగా, రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథకంలో భాగంగా ఆర్టీసీలో బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణాన్ని ప్రవేశ పెట్టడంతో ఈ రక్షాబంధన్ పర్వ దినం వారికి మరింత జోష్‌నిచ్చింది. గతంలో దూరంగా ఉన్న తన సోదరులకు రాఖీ కట్టేందుకు వెళ్లాలంటే ప్రయాణ ఖర్చులు భారమై వెళ్లలేక రాఖీలు పంపించేవారు. ప్రస్తుతం ఆర్టీసీ ఉచిత ప్రయాణంతో ఆడపడుచులు చాలా సంతోషంగా దూరంగా ఉన్న తన సోదరులకు రాఖీ కట్టేందుకు వెళ్లనున్నారు. ముఖ్యంగా ఈ పథకం తమకు వరంలాంటిదని పేద, మధ్యతరగతి ఆడపడుచులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



ముందస్తుగా వేడుకలు..

జిల్లాలోని విద్యాసంస్థల్లో శనివారం ముందస్తుగా రక్షాబంధన్ వేడుకలను నిర్వహించారు. ఆయా పాఠశాలల్లోని బాలబాలికలతో వేడుకలు నిర్వహించి స్వీట్లు పంపిణీ చేశారు. అలాగే బీజేపీ, వీహెచ్‌పీ నాయకులు ముందస్తు రక్షాబంధన్ వేడుకలను నిర్వహించారు. నాయకులు రాఖీలు కట్టి, స్వీట్లు పంచి సంబరాలు జరుపుకున్నారు.

ఘనంగా వృక్షాబంధన్ వేడుకలు



వృక్షానికి రాఖీ కడుతున్న మదర్ హ్యూమన్ సభ్యులు

కోల్‌సిటీటౌన్, ఆగస్టు 18: గోదావరిఖనిలో ఆదివారం వృక్షాబంధన్ కార్యక్రమం నిర్వహించారు. మదర్‌హ్యూమన్ యూత్ సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద వృక్షాబంధన్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వృక్షాలను సంరక్షించాలంటూ ఆలయంలోని చెట్లకు రాఖీలు కట్టారు. రాఖీపౌర్ణమి రోజున అన్నాచెల్లెళ్ళ అనురాగానికి చిహ్నంగా రాఖీలు కట్టే ఆనవాయితీ ఉండగా అదే తరహాలో వృక్షాలకు ప్రజలకు అత్యంత విలువైన అనుబంధం ఉందని చాటి చెప్పేందుకు కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు సొసైటీ బాధ్యులు తెలిపారు. సొసైటీ అధ్యక్షుడు పిట్టల రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో న్యాయవాది తాజోద్దిన్‌బాబా, ఆలయ కమిటీ సభ్యులు శ్రీనివాస్, ముప్పు రాజమౌళి, లచ్చయ్య, కట్ల శ్రీనివాస్, సొసైటీ కార్యదర్శి శ్రీవాణి, అహ్మద్‌పాషా, కనకయ్య పాల్గొన్నారు. అలాగే తెలంగాణ మహిళా మిత్ర ఆధ్వర్యంలో స్థానిక ఎన్‌టీపీసీ అన్నపూర్ణ కాలనీలో వృక్షాబంధన్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ మహిళా మిత్ర సభ్యురాలు వృక్షానికి రాఖీలు కట్టారు. ఈ కార్యక్రమంలో గోలివాడ చంద్రకళ, మేడగోని స్వప్న, శ్యామల, జక్కెన, శ్రీలత, సరిత, నసీమా, అక్తర్‌పాషా పాల్గొన్నారు.

ఓబీసీ అడ్వకేట్స్ వర్క్‌షాప్, సదస్సును జయప్రదం చేయండి



ఖనిలో పోస్టర్‌లను ఆవిష్కరిస్తున్న న్యాయవాదులు

కోల్‌సిటీటౌన్, ఆగస్టు 18: హైదరాబాద్ మాసబ్ ట్యాంక్ వద్ద ఈనెల 25న జరుగనున్న ఓబీసీ అడ్వకేట్స్ సదస్సు, వర్క్‌షాప్‌లో రాష్ట్రంలోని న్యాయవాదులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ ప్రధానకార్యదర్శి శ్యామ్‌సన్, నాయకులు కె.నరేందర్, మల్లేష్ పిలుపునిచ్చారు. ఆదివారం గోదావరిఖని బార్ అసోసియేషన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఓబీసీ అడ్వకేట్స్ వర్క్‌షాప్, సదస్సును విజయవంతం చేయాలని కోరుతూ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓబీసీలకు 60శాతం కూడా రిజర్వేషన్ల వాటా అందలేదని తెలిపారు. ఇప్పటివరకు బీసీల సెన్సెస్ జరగలేదని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సెన్సెస్‌పై దృష్టి సారించడం లేదని, దీంతో ఓబీసీలకు రిజర్వేషన్లలో అన్యాయం జరుగుతోందన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి రిజర్వేషన్ వాటా వారికి అందేలా పోరాటాం చేయాలని పిలుపునిచ్చారు. ఈ అంశంపై మొదటిసారిగా హైదరాబాద్‌లో ఓబీసీ అడ్వకేట్ సదస్సు, వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తౌటం సతీష్, ప్రధానకార్యదర్శి జువ్వాజి శ్రీనివాస్ ఉపాధ్యక్షులు రామటెంకి శ్రీనివాస్, మురళీధర్‌యాదవ్, ముచ్చకుర్తి కుమార్, అరుణ్‌యాదవ్, చంద్రశేఖర్, సిరిమల్లె అనిల్, సిరిమల్లె అవినాష్, పూర్మ శ్రీనివాస్, శైలజ, రాగం శ్రీధర్, రాజేందర్, రవి, న్యాయవాదులు పాల్గొన్నారు.

బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులను వ్యతిరేకిస్తూ
గోదావరిఖనిలో ముస్లింల నిరసన



చౌరస్తాలో నిరసన తెలుపుతున్న ముస్లింలు

కోల్‌సిటీ, ఆగస్టు 18: బంగ్లాదేశ్‌లో హిందువులు, హిందు దేవాలయాలపై దాడుల పట్ల గోదావరిఖనిలో ముస్లిం మైనార్టీ సంఘం నిరసన తెలిపింది. హజ్ కమిటీ సభ్యురాలు సనా ఫక్రుద్దీన్ ఆధ్వర్యంలో ముస్లీం మైనార్టీ సంఘం ప్రతినిధులు స్థానిక మెయిన్ చౌరస్తాలో నిరసన ప్రదర్శన జరిపారు. బంగ్లాదేశ్‌లో మైనార్టీలుగా ఉన్న హిందువులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ఆ దేశ ప్రభుత్వంపై ఉందన్నారు. భారత మైనార్టీలుగా వారికి పూర్తిస్థాయి సంఘీభావం తెలుపుతున్నామన్నారు. భారత ప్రభుత్వం ఈ మేరకు బంగ్లాదేశ్‌పై ఒత్తిడి తేవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ సంఘం నాయకులు ఫసియోద్దీన్, ఫక్రుద్దీన్, ఫజల్ బేగ్, రషీద్, సత్తార్, అబీద్, సర్వర్, హఫీజ్, రియాజుద్దీన్ పాల్గొన్నారు.

సర్దార్ సర్వాయి పాపన్న ఆశయ సాధనకు కృషి



కలెక్టరేట్‌లో నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్న అదనపు కలెక్టర్ అరుణశ్రీ

పెద్దపల్లి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ ఆశయ సాధనకు కృషి చేయాలని అదనపు కలెక్టర్ జే. అరుణశ్రీ అన్నారు. ఆదివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వెనకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న జయంతి ఉత్సవాలు అధికారికంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ అరుణశ్రీ పాల్గొని జ్యోతిప్రజ్వలన చేసి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి వారి ఆశయ సాధనకు పాటుపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌడ సంఘం అధ్యక్షుడు అంజయ్యగౌడ సంఘం ప్రతినిధులు బాలసాని వెంకటేషం గౌడ్, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. అలాగే పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని సర్వాయి పాపన్న విగ్రహానికి పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రాంత బహుజనవీరుడు ఔరంగజేబును ఓడించి గోల్కొండ కోటను జయించిన ధీరుడు సర్వాయిపాపన్న అని అన్నారు. ఆయన ఆశయాలను ప్రతిఒక్కరూ కొనసాగించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బండారి శ్రీనివాస్‌గౌడ్, దూలం సతీష్, గంగాధర బాపుగౌడ్, బుర్ర నరేష్, ముత్యం లక్ష్మణ్ గౌడ్, మెట్టు సమ్మయ్యగౌడ్, ముంజ సతీష్, తీగల రమేష్, ప్రదీప్, సలేంద్ర రాములు, అంజయ్య, పెగడ శ్రీనివాస్ పాల్గొన్నారు.

సీఎం, మంత్రి శ్రీధర్‌బాబును కలిసిన ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్



సీఎం రేవంత్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న మక్కాన్‌సింగ్

గోదావరిఖని, ఆగస్టు 18: విదేశీ పర్యటన ముగించుకుని పెట్టుబడులతో తిరిగి వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబులను ఆదివారం రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ మర్యాదపూర్వకంగా కలిశారు. వారిని సత్కరించారు. ముఖ్యమంత్రి, శ్రీధర్‌బాబులు అమెరికా పర్యటనలో వివిధ సంస్థల ప్రతినిధులతో మాట్లాడి రూ.36వేల కోట్ల పెట్టుబడులు తీసుకురావడం హర్షనీయమన్నారు. అమెరికా నుంచి రూ. 31,502 కోట్లు, దక్షిణ కొరియా నుంచి రూ.4,500కోట్లు, 25కంపెనీలతో ఒప్పందాలు చేసుకున్నారన్నారు. ఈ పెట్టుబడులు రాష్ట్ర పురోభివృద్ధికి ఎంతో ఉపయోగపడుతాయని మక్కాన్‌సింగ్ పేర్కొన్నారు.

రాజ్యాధికార వాటా కోసం మరో పోరాటానికి సిద్ధం కావాలి



మాట్లాడుతున్న వీజీఆర్ నారగోని

కోల్‌సిటీటౌన్, ఆగస్టు 18: రెడ్డి, వెలమ, కమ్మ బ్రాహ్మణుల ఆధిపత్యంలో ఉన్న అధికారం 50 శాతంపైగా బీసీలు పొందాల్సిన రాజ్యాధికారం వాటాలో తీవ్ర అన్యాయం జరుగుతుందని, అందుకోసం బీసీలు మరో పోరాటానికి సిద్ధం కావాలని బీసీ, ఎస్‌సీ, ఎస్‌టీ మైనార్టీ ప్రజానాయకుడు విజీఆర్ నారగోని పిలుపునిచ్చారు. ఆదివారం గోదావరిఖనిలోని స్నేహసాహితీ గ్రంథాలయంలో సామాజిక రాజకీయ సమన్యాయం అంశంపై జరిగిన సభకు ఆయన వక్తగా హాజరై మాట్లాడారు. బీసీ, ఎస్‌సీ, ఎస్‌టీ, మైనార్టీలు వారి ఓటు వారు వేసుకోవడంలో ప్రజల్ని చైతన్యం చేయలేకపోతున్నారని పేర్కొన్నారు. మొదట పూర్తిగా బ్రాహ్మణ ఆధిపత్యంలో ఉన్న రాజకీయాల్లో భాగస్వామ్యం కోసం మద్రాసు ప్రెసిడెన్సీలో జస్టిస్ పార్టీ ఏర్పాటు చేసుకున్న నేటి రెడ్డి, వెలమ, కమ్మ తదితర నాన్ బ్రాహ్మణ్స్ రిజర్వేషన్ సాధించుకొని అధికారం చేజిక్కించుకున్న చరిత్ర ఉందన్నారు. రాజ్యాధికారంలో వాటా కోసం అడగడానికి బీసీలకు 100 ఏళ్ళు పట్టిందన్నారు. అయినా ఇంకా ఓటు వేసుకునే చైతన్యంలో వెనుకపడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. 70ఏళ్ళుగా బీసీలకు ద్రోహం చేసిన కాంగ్రెస్ పార్టీ నేటికి తాము అధికారంలోకి వస్తే కులగణన చేస్తామని చెబుతుందే కానీ రాజ్యాధికారంలో వాటా ఇస్తామని అనడం లేదని విమర్శించారు. బీసీ, ఎస్‌సీ,ఎస్‌టీ, మైనార్టీలను ఏకం చేయడం, చైతన్యం పరిచేందుకు యాత్ర కార్యక్రమం చేపట్టనున్నట్టు తెలిపారు. ఏలేశ్వరం వెంకటేష్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో నాయకులు మాదరబోయిన నర్సయ్య, పాల్, వేముల అశోక్, రాజు, పోచయ్య, ఎల్కటూరి శంకర్, ఫసియోద్దిన్ తదితరులు పాల్గొన్నారు.

దొంగతనాలపై అప్రమత్తంగా ఉండాలి



కాలనీవాసులతో మాట్లాడుతున్న సీఐ

యైటింక్లయిన్‌కాలనీ, ఆగస్టు 18: దొంగతనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని పోతనకాలనీ వాసులకు టూటౌన్ సీఐ ప్రసాదరావు సూచించారు. ఇటీవల చోరీలు జరిగిన నేపథ్యంలో శనివారం కాలనీ ప్రజలతో సీఐ సమావేశమయ్యారు. ఈసందర్భంగా చోరీల నియంత్రణకు పలు సూచనలు చేసి, పోలీస్ శాఖ తీసుకుంటున్న చర్యలకు సహకరించాలని కోరారు. ఎవరైనా కొత్త వ్యక్తులు కాలనీ ప్రాంగణంలోకి వస్తే పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని సూచించారు. ప్రతి బ్లాక్ వద్ద సీసీ కెమెరా ఏర్పాటు చేసుకోవాలని, నేర జరిగినపుడు నేరస్థులను సులువుగా గుర్తించే అవకాశం ఉంటుందని తెలిపారు.

బస్ స్టేషన్‌లో కూల్చివేత పనులు.. ఇబ్బందుల్లో ప్రయాణికులు..



ఎండలో బస్సుల కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు

సుల్తానాబాద్, ఆగస్టు 18: సుల్తానాబాద్ బస్‌స్టేషన్‌లో కూల్చివేత పనులు జరుగుతుండడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా మహిళా ప్రయాణికులు అసౌకర్యాలకు గురవుతున్నారు. దాదాపు నాలుగు దశాబ్దాల క్రితం నిర్మించిన సుల్తానాబాద్ ఆర్టీసీ బస్ స్టేషన్ ప్రస్తుతం శిథిలావస్థకు చేరింది. తరచూ స్టేషన్ పైకప్పు పెచ్చులు ఊడుతున్నాయి. పలుసార్లు ప్రయాణికుల తలలపై పడడంతో పలువురికి గాయాలయ్యాయి. ఈ మేరకు ఆర్టీసీ ఇంజనీరింగ్ విభాగం అధికారులు బస్టాండ్‌ను పరిశీలించారు. కొంత పైకప్పు భాగాన్ని ల్యాబ్‌లో పరిశీలించగా పైకప్పును తొలగించాలని నివేదిక ఇచ్చారు. దీంతో వారం క్రితం సుల్తానాబాద్ పైకప్పు కూల్చివేత పనులు కొనసాగుతున్నాయి. ప్రయాణికులు ఉండడానికి తాత్కాలికంగా పక్కను ఓ తడకల షెడ్డు ఏర్పాటు చేశారు. కొన్ని రోజుల నుంచి ప్రయాణికుల రద్దీ ఏర్పడడంతో నిలుచోవడానికి కూడా నీడ లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. వారం నుంచి ప్రయాణికులు నరకయాతన పడుతున్నారు. ఆర్టీసీ అధికారులు ప్రత్యామ్నాయంగా ఏర్పాట్లుచేయాలని మరింత నీడ కల్పించాలని కోరుతున్నారు. రాఖీ పూర్ణిమ సందర్భంగా రెండు రోజుల నుంచి మహిళల రద్దీ ఎక్కువయింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగిన ఏర్పాట్లు చేయాలని పలువురు ప్రయాణికులు కోరుతున్నారు.

మూలమలుపులతో పొంచి ఉన్న ముప్పు


- ప్రాణాంతకంగా మారిన వైనం
- కనిపించని హెచ్చరిక బోర్డులు
- పట్టించుకోని అధికారులు




పొత్కపల్లి ఊర చెరువు దగ్గర ప్రమాదకరంగా ఉన్న మూలమలుపు

ఓదెల, ఆగస్టు 18 : సుల్తానాబాద్ నుంచి ఓదెల మండలం మీదుగా జమ్మికుంట వైపు వెళ్లే ప్రధాన బీటీ రోడ్లలో ఉన్న మూలమలుపులు వాహనదారులకు ప్రాణాంతకంగా మారాయి. ఇప్పటికి ఈ రోడల్లో 12 ప్రమాదాలు సంభవించి పలువురు వ్యక్తులు తీవ్ర గాయాలపాలయ్యారు. గత వేసవిలో జమ్మికుంట వైపు వెళుతున్న మామిడి పండ్ల వ్యాపారి జనార్థన్ గుంపుల మానేరు బ్రిడ్జి దాటిన తర్వాత ట్రాలీతో బోల్తాపడి తీవ్రంగా గాయపడ్డాడు. అలాగే ద్విచక్ర వాహనంపై సుల్తానాబాద్ వైపు వస్తున్న దంపతులు సమీపంలో ఉన్న మూలమలుపు వద్ద అదుపుతప్పి కింద పడడంతో గాయాలయ్యాయి. అలాగే కనుకుల నుంచి కనగర్తి వైపు వస్తున్న ద్విచక్ర వాహదారులు మారుతినగర్ దాటి గుండ్లపల్లి వైపు వస్తున్న క్రమంలో మూలమలుపు వద్ద రెండు వాహనాలు ఢీకొనగా స్వల్పగాయాలతో బయటపడ్డారు. అలాగే ఈనెలలో పోత్కపల్లి ఊర చెరువు మత్తడి మూలమలుపు వద్ద మంచిర్యాలలో క్రషర్ నిర్వహించే వ్యక్తులు కారులో వేగంగా వస్తూ ద్విచక్ర వాహనదారున్ని ఢీకొనడంతో పొలంలో ఎగిరిపడి పోత్కపల్లికి చెందిన తండ్రి, కొడుకులిద్దరు తీవ్ర గాయాలకు గురయ్యారు. ఇదే మూలమలుపు వద్ద ఇప్పటికి ఎనిమిది ప్రమాదాలు జరిగాయి. అయినా కూడా ఆర్‌అండ్‌బీ అధికారులు హెచ్చరిక సూచికలు మూలమలుపుల వద్ద ఏర్పాటు చేయకపోవడం, కనీసం స్పీడ్ బ్రేకర్లు కూడా ఏర్పాటు చేయకపోవడం వల్ల తరచుగా ప్రమాదాలు జరు గుతున్నాయి. కనగర్తి చెరువు వద్ద, అలాగే హరిపురం నుంచి ఓదెల వైపు వెళ్లే బైపాస్ రోడ్డులో, ఓదెల రైల్వే స్టేషన్ నుంచి పెగడపల్లి వైపు వెళ్లే రోడ్డులో అధికంగా మూలమలుపులు ఉన్నాయి. ఈ రోడ్లలో వాహనదారులు ఎదురైన క్రమంలో పలుమార్లు ప్రమాదాలు తప్పాయి. ఓదెల మండలంలోని రోడ్ల నుంచి వివిధ మండలాలకు వెళ్లే రోడ్ల లో ఉన్న మలుపుల వద్ద ఎప్పుడు ఎలాంటి వాహన ప్రమాదాలు జరుగుతాయోనని వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు.

గుంపుల నుంచి ఓదెల, పొత్కపల్లి వైపు అలాగే గుంపుల నుంచి కాల్వశ్రీరాంపూర్ వైపు వెళ్లే ప్రధాన రహదారుల్లో గూడెం సమీపంలోని మూలమలుపుల వద్ద పలుమార్లు జరిగిన వాహన ప్రమాదాల్లో అదుపుతప్పి వాహనాలు ఢీకొన్న సంఘటనలో పలువురు వ్యక్తులు ప్రాణాలు విడిచిన సంఘటన కూడా ఉన్నాయి. అయినప్పటికీ సంబంధిత అధికారులు స్పందించి స్పీడ్ బ్రేకర్లు, ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడం గమనార్హం. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మూలమలుపుల వద్ద స్పీడ్ బ్రేకర్లు, సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని వాహదారులు కోరుతున్నారు.







విద్యుదాఘాతంతో ఒకరి మృతి

- నీళ్లు వేడి చేసేందుకు హీటర్ పెడుతుండగా ప్రమాదం

మేడిపల్లి, ఆగస్టు 18: కట్లకుంట గ్రామంలో స్నానానికి నీళ్ల వేడి చేసేందుకు హీటర్ పెట్టే క్రమంలో విద్యుదాఘాతానికి గురై గడ్డం మాలకొండయ్య(48) అనే వ్యక్తి మృతి చెందాడు. నెల్లూరు జిల్లాకు చెందిన మాలకొండయ్య ఐదు నెలలుగా గ్రామంలో తాపీ పని చేస్తున్నాడు. ఆదివారం స్నానం చేసేందుకు నీళ్లు పెడుతూ విద్యుత్ షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందాడు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై శ్యాంరాజ్ తెలిపారు.







శ్రీరాంసాగర్‌కు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

- కాకతీయ కాలువకు పెరిగిన నీటి విడుదల



శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో ఉన్న నీటి నిల్వలు

జగిత్యాల, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో రావడం ఆదివారం కొనసాగింది. ఎస్సారెస్పీలోకి 8,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులో ప్ర స్తుతం 49.117 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, సాగు నీటి కాలువలు, ఇతర అవసరాలకు 5,453 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

లారీ ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు

తిమ్మాపూర్, ఆగస్టు 18: మండలంలోని ఇందిరానగర్ వద్ద రాజీవ్ రహదారిపై ఆదివారం సాయంత్రం ముందుగా వెళుతున్న ద్విచక్ర వాహనదారుడిని లారీ ఢీకొట్టిన ప్రమాదంలో ఒకరికీ తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, ఎల్ఎండీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్‌కి చెందిన షేక్ ఫారూఖ్ కోడిగుడ్లు అమ్ముకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటు న్నాడు. ఆదివారం ద్విచక్ర వాహనంపై కోడిగుడ్లను తీసుకొని ఇంటికి వెళుతున్నాడు. ఆ సమయంలో మండలంలోని ఇందిరానరగ్ గ్రామం సమీపంలో రాజీవ్ రహదారిపై హైదారాబా ద్ నుంచి కరీంనగర్‌కు అతివేగంగా వచ్చిన ఓ లారీ ఫారూఖ్ ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది. కింద పడిన అతడికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదం చేసిన లారీ డ్రైవర్ వాహనం ఆప కుండా పారిపోయేందుకు యత్నించాడు. స్థానిక యువకులు లారీని వెంబడించి పట్టుకున్నారు. ఈ ప్రమాదంలో ఫారూఖ్‌కు కాళ్లు, చేతులు విరిగి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం మేరకు పోలీసులు అక్కడికి చేరుకుని చేరుకొని ఫారూఖ్‌ను 108లో కరీంనగర్ తరలించారు.

గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యం

జగిత్యాలరూరల్, ఆగస్టు 18: జగిత్యాల పట్టణంలోని నూతన బస్టాండ్ లో ఆదివారం గుర్తుతెలియని మహిళ మృతదేహాన్ని జగిత్యాల పట్టణ ఎస్సై ఇంద్రకరణ్‌రెడ్డి గుర్తించారు. జగిత్యాల పట్టణ కొత్తబస్టాండ్ లో ఓ మహిళ అపస్మారక స్థితిలో పడిఉందని పోలీసులకు స మాచారం అందింది. ఈమేరకు సంఘటన స్థలానికి పోలీసులు చేరుకొని మహిళను పరీ శీలించి చూడగా మహిళ మృతిచెంది ఉన్నది. మహిళ గులాబీ కలర్ స్వెటర్ ధరించి బ్రౌన్ కలర్‌చీర ధరించి ఉందని పట్టణ పోలీసులు తెలిపారు. సుమారు 40 ఏళ్లు ఉంటుందని తెలిపారు. మహిళ మృతదేహాన్ని జగిత్యాల పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి మా ర్చురీగదిలో భద్రపరిచినట్లు ఎస్సై ఇంద్రకరణ్‌రెడ్డి తెలిపారు. మహిళ ఆచూకి ఎవరికైన తెలిస్తే జగిత్యాల పట్టణ పోలీస్ స్టేషన్‌లో సమాచారం అందించాలని ఎస్సై కోరారు.

అదుపుతప్పి డివైడర్ పైకి దూసుకెళ్లిన కారు

జగిత్యాలరూరల్, ఆగస్టు 18: జగిత్యాల జిల్లా కేంద్రంలోని గోవిందుపల్లి వీధి వద్ద ఆదివారం రాజీవ్‌బైపాస్‌మీదుగా ప్రయాణిస్తున్నకారు అదుపుతప్పి డివైడర్ పైకి దూసుకెళ్లింది. ధర్మపురివైపు నుంచి జగిత్యాల వైపు కారులో వెళ్తుండగా ఒక్కసారిగా బ్రేక్‌పై పడడంతో కారు అదుపుతప్పి డివైడర్‌పైకి దూసుకెళ్లింది. ఈప్రమాదంలో ఎవరికి ఎటువంటి గాయాలు కాలేదు.







ధర్మపురి క్షేత్రంలో భక్తుల సందడి



స్వామి వారిని దర్శనం చేసుకుంటున్న భక్తులు

ధర్మపురి, ఆగస్టు 18: ధర్మపురి క్షేత్రంలో ఆదివారం భక్త జన సందడి నెలకొంది. శ్రావణ మాసం పురస్కరించుకుని స్థానిక శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి అనుబంధ ఆలయాలు భక్తులతో కిట కిటలాడాయి. దూర ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు గోదావరి నదిలో స్నానాలు చేసి స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులు అభిషేకం, అర్చన, హోమం, నిత్య కళ్యాణం టిక్కెట్లు కొనుగోలు చేసి పూజలు చేయించారు. అంతకు ముందు అనుబంధ ఆలయాల్లో వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, సామవేద పండితులు ముత్యాలశర్మ, పాలెపు ప్రవీణ్‌కుమార్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తో పొత్తు ఉండదు

- కేసీఆర్, కేటీఆర్ అంటేనే జనం రాళ్లతో కొట్టే పరిస్థితి - కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్

సిరిసిల్ల రూరల్, ఆగస్టు 18: అవినీతి పార్టీగా ప్రజల్లో ముద్రపడిన బీఆర్ఎస్ పార్టీతో పొత్తు పెట్టుకోవాల్సిన ఖర్మ భారతీయ జనతా పార్టీకి లేదని, ప్రస్తుతం తెలంగాణలో కేసీఆర్, కేటీఆర్ పేరు ఎత్తితేనే జనం రాళ్లతో కొట్టే పరిస్థితి ఏర్పడిందని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. సిరిసిల్ల పట్టణంలో మార్కండేయ ఆలయంలో పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన మహా చండీయాగంలో బండి సంజయ్‌కుమార్ ఆదివారం పాల్గొనగా ఆలయ కమిటీ, పద్మశాలీ సంఘం నాయకులు, పద్మ పూజారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయ అవరణంలో జరుగుతున్న యాగంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన నగల షోరూంను బండి సంజయ్‌కుమార్ ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బండి సంజయ్‌కుమార్ మాట్లాడారు. రాష్ట్రంలో ప్రజలకు అలవికాని హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ రుణమాఫీతో పాటు ఆరు గ్యారంటీలపై చర్చను పక్కదారి పట్టించేందుకు విలీన డ్రామాలు ఆడుతున్నారన్నారు. రుణమాఫీ కానీ రైతులు కాంగ్రెస్ పార్టీ దిష్టిబొమ్మలను దహనం చేస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కలిసి డ్రామాలు ఆడుతున్నాయని ఆరోపించారు. రుణమాఫీపై కాంగ్రెస్ మాట తప్పిందని 64 లక్షల మంది రుణాలు తీసుకుంటే 24 లక్షల మందికే మాఫీ చేయడం ఏమిటని అన్నారు. రైతులందరికి రుణమాఫీ చేస్తామని ఇచ్చిన హామీలు ప్రకారం ఎన్నికల్లో రూ 40 వేల కోట్ల రుణాలు మాఫీ చేస్తామని ప్రకటించి బడ్జెట్‌లో రూ 26 వేల కోట్లు కేటాయించి చివరకు రూ 17 వేల కోట్లు మాత్రమే మాఫీ చేశారన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ లక్ష రుణమాఫీ చేస్తామని రైతులను మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ పార్టీ కూడా రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేసినట్లు చెబుతూ మోసం చేస్తుందని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే రైతులకు బ్యాంకుల నుంచి క్లియరెన్స్ సర్టిఫికేట్‌లను ఇప్పించాలని అన్నారు. రుణాలు తీసుకున్న రైతులకు క్లియరెన్స్ సర్టిఫికేట్‌లు రాకుంటే భవిష్యత్తులో ఎలాంటి రుణాలు పొందలేదనే విషయాన్ని గుర్తు చేసుకోవాలని అన్నారు. కల్యాణలక్ష్మి పథకానికి లక్ష రూపాయలు, తులం బంగారంతో సహా ఆరు గ్యారంటీలు ఇప్పటికీ అమలు చేయడం లేదన్నారు. 30 వేల ఉద్యోగాలని చెప్పి కేవలం 12 వేల ఉద్యోగాలు మాత్రమే కాంగ్రెస్ ప్రభుత్వం



సిరిసిల్లలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్

ఇచ్చిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అద్దాల మేడలో కూర్చొని ప్రజలకు అన్నీ చేశామని అనుకుంటుందని అన్నారు. రైతు భరోసా, బోనస్, రుణమాఫీ చేస్తామని చేయలేదనే ప్రజలు తెలుసుకున్నారని అన్నారు. రైతులు అమాయకులు కాదని, వారు దుఖంలో ఉన్నారని వారికి భరోసా కల్పించడంతో పాటు ఇచ్చిన హామీలు నేరవేర్చాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మోసపూరిత వాగ్దానాలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని బండి సంజయ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ పార్లమెంటరీ కన్వీనర్ ప్రవీణ్‌రావు, కో కన్వీనర్ అడెపు రవీందర్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాగుల సంతోష్, జిల్లా ఉపాధ్యక్షులు శీలం రాజు, గరిపెల్లి ప్రభాకర్, అన్నల్‌దాస్ వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం

- టీఉద్యోగుల జేఏసీ రాష్ట్ర చైర్మన్ మారం జగదీశ్వర్



మాట్లాడుతున్న మారం జగదీశ్వర్

జగిత్యాలరూరల్, ఆగస్టు 18: ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం చేస్తున్నామని టీ ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర చైర్మన్ మారం జగదీశ్వర్ అన్నారు. పట్టణంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా కేంద్రానికి వచ్చిన జగదీశ్వర్‌ను పట్టణంలోని సంఘ కార్యాలయంలో పలువురు అసోసియేషన్ సభ్యులు, నాయకులు ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారం దిశగా కార్యాచరణ రూపకల్పనకు 15 మందితో రాష్ట్ర స్థాయిలో స్టీరింగ్ కమిటీ ఏర్పాటు చేశామన్నారు. గత ప్రభుత్వం ఉద్యోగుల స్నేహపూర్వక సర్కారు అని చెప్పి చివరకు సంఘాలను నిర్వీర్యం చేసిందని విమర్శించారు. కనీసం ఒకటవ తేదీన వేతనాలను సైతం అందివ్వలేదని ఆరోపించారు. కొత్తగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగులకు, పెన్షనర్లకు ఒకటవ తేదీననే వేతనాలు, పెన్షన్లు అందిస్తుండడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. పెండింగ్ డీఏలు, పీఆర్సీ అమలు, నగదు రహిత వైద్య సేవలు, 317 జీవో, సీపీఎస్ రద్దు, ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీసు నిబంధనల అమలు, పెన్షనర్లకు డైరెక్టరేట్ ఏర్పాటు వంటి 36 సమస్యల పరిష్కారానికి పోరాడుతున్నామన్నారు. త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి సమస్యలను ఆయన దృష్టికి తీసుకవెళ్ళుతామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షుడు హరి అశోక్ కుమార్, కందుకూరి రవి బాబు, వొడ్నాల రాజశేఖర్, బైరం హరి కిరణ్, వెల్మల ప్రకాశ్‌రావు, రవిచంద్ర, రవీందర్, మమత, రాజేశం, సుగుణాకర్, మధుకర్, మహమూద్, భువనేశ్వర్, కుమార స్వామి, ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఎండీకి తగ్గిన ఇన్‌ఫ్లో

తిమ్మాపూర్, ఆగస్టు 18: కరీంనగర్ పరిధిలోని దిగువమానేరు జలాశయంలోకి వస్తున్న ఇన్‌ఫ్లోలు ఆదివారం సాయంత్రానికి తగ్గాయి. రెండు, మూడు రోజులుగా ఎగువన కురుస్తున్న వర్షాల కారణంగా మోయతుమ్మెద వాగు నుంచి ఎల్‌ఎండీలోకి వస్తున్న ఇన్‌ఫ్లో పెరిగింది. కాగా వర్షాలు లేకపోవడంతో పై నుంచి వస్తున్న ఇన్‌ఫ్లోలు తగ్గయి. శనివారం ఉదయం 1,190క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నీరు ఎల్‌ఎండీలోకి వస్తుండగా సాయంత్రానికి 1,551క్యూసెక్కులకు పెరిగింది. ఆదివారం ఉదయం ఇన్‌ఫ్లో 2,197క్యూసెక్కులకు పెరిగింది. సాయంత్రం 6గంటల ప్రాంతంలో కేవలం 707 క్యూసెక్కులకు తగ్గిపోయింది. ఎల్‌ఎండీ పూర్తి స్థాయి నీటి మట్టం 24.034 టీఎంసీలు కాగా ఆదివారం సాయంత్రం 5.723టీఎంపీల నీరు నిల్వ ఉన్నట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు.



ఎల్‌ఎండీలో ఉన్న ప్రస్తుతం ఉన్న నీటి నిల్వలు

గంజాయి కిట్ల సహాయంతో ఆరుగురు నిందితుల అరెస్ట్

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 18: గంజాయి కిట్ల సహాయంతో జిల్లా వ్యాప్తంగా ఆరుగురు నిందితులను అరెస్ట్ చేశామని ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదివారం తెలిపారు. రెండు రోజుల వ్యవధిలోనే వీరి వద్ద నుంచి 600 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నామన్నారు. గంజాయికి అలవాటు పడి తాగేవారు జాగ్రత్తగా ఉండాలన్నారు. గంజాయి రహిత జిల్లాగా మార్చడానికి విస్తృత కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఇందులో భాగంగానే ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని, గంజాయి రవాణాపై స్పెషల్ డ్రైవ్‌లు, నార్కోటిక్ జాగిలాలతో తనిఖీలు చేపడుతూ గంజాయి రవాణాపై ఉక్కుపాదం మోపుతున్నామన్నారు. జిల్లాలో విస్తృతంగా గంజాయి కిట్ల సహాయంతో టెస్టులు చేస్తూ గంజాయి సేవించే వారిని అదుపులోకి తీసుకుంటున్నామన్నారు. సిరిసిల్లలో ఇద్దరు నిందితులైన ఒల్లెపు వంశీ, భీంరాజ్‌లను అదుపులోకి తీసుకొని 200 గ్రా ముల గంజాయిని, కోనరావుపేటలో ఇద్దరు నిందితులైన అరుణ్, అజ్మీర్‌వికాస్‌ల వద్ద 200 గ్రాముల గంజాయిని, తంగళ్లపల్లిలో ఇద్దరు నిందితులైన సాయి, సాగర్‌ల వద్ద 200 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకొని ఆరుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు.

25న సైక్లింగ్ జిల్లా జట్ల ఎంపిక పోటీలు



మాట్లాడుతున్న సైక్లింగ్ అసోసియేషన్ జిల్లా చైర్మన్ డాక్టర్ నరేందర్‌రెడ్డి

కరీంనగర్ స్పోర్ట్స్, ఆగస్టు 18: జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 25న జిల్లా రోడ్ సైక్లింగ్ జట్ల ఎంపిక పోటీలను నిర్వహిస్తున్నామని సైక్లింగ్ అసోసియేషన్ చైర్మన్ నరేందర్‌రెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలోని వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ పాఠశాలలో ఆదివారం అసోసియేషన్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ సైక్లింగ్‌కు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు ఉందని, సైక్లింగ్‌తో ప్రతి ఒక్కరూ ఆరోగ్యవంతులుగా ఎదుగుతారని అన్నారు. జిల్లా కేంద్రానికి సమీపంలోని వెలిచాల బైపాస్ రోడ్డులో 25న అండర్-14, 16, 18, 23, ఆపై వయస్సు విభాగాల్లో బాల బాలికలకు పోటీలు నిర్వహించి జిల్లా జట్లను ఎంపిక చేయనున్నామని తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు తమ స్వంత సైకిల్‌తో హాజరుకావాలన్నారు. సమావే శంలో సంఘం అధ్యక్షుడు డాక్టర్ జి.మధుసూదన్‌రెడ్డి, కార్యదర్శి వేణుగోపాల్, సభ్యులు రమేశ్, ఎస్.మనోహరాచారి, ఎస్.అన్వేష్, ఎస్ రాజయ్య, సత్యం తదితరులు పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక పోటీలకు స్పందన



బాస్కెట్‌బాల్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

కరీంనగర్ స్పోర్ట్స్, ఆగస్టు18: జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన జిల్లా యూత్ బాల బాలికల బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక పోటీలకు విశేష స్పందన లభించింది. జిల్లా కేంద్రంలోని టీజీఎన్‌పీడీసీఎల్ బాస్కెట్‌బాల్ మైదానంలో నిర్వహించిన ఈ పోటీలకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 40 మంది బాలురు, 30 మంది బాలికలు హాజరై ప్రతిభ చాటారు. వీరిలో విశేష ప్రతిభ చాటిన 18 మంది బాలురు, 18 బాలికలను ఈనెల 24వరకు అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించే శిక్షణ శిబిరానికి ఎంపిక చేశారు. జిల్లా పోటీల నిర్వహణను జిల్లా బాస్కెట్‌బాల్ సంఘం ప్రధాన కార్యదర్శి బి అనంతరెడ్డి పర్యవేక్షించారు. సీనియర్ క్రీడాకారులు, పీడీలు శ్రీధర్‌రావు, సునీల్‌కుమార్, దూడ సత్యానందం, అరుణ్‌తేజ, జీవన్‌కుమార్, వెంకటేష్, జాయ్ అనిల్, పర్మిత్‌కౌర్, అభి, జోయల్, హెన్రీ, శివకుమార్ పాల్గొన్నారు.

అల్లుడిపై మామ దాడి

- బండరాయితో తలపై కొట్టడంతో అక్కడికక్కడే మృతి

జూలపల్లి, ఆగస్టు 18: మండలంలోని కాచాపూర్ గ్రామంలో ఆదివారం అల్లుడిపై మామ దాడిచేశాడు. తలపై రాడ్‌తో కొట్టడంతో అల్లుడైన జేజేల అశోక్ అలియాస్ చెత్తయ్య(40) మృతిచెందాడు. జూలపల్లి ఎస్‌ఐ శ్రీధర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాచాపూర్ గ్రామానికి చెందిన జాడి కనుకయ్య తన అల్లుడైన అదే గ్రామానికి చెందిన అశోక్‌ను ఆదివారం మధ్యాహ్నం విందు ఇస్తానంటూ ఇంటికి పిలిపించుకున్నాడు. ఇంట్లో ఉన్న రాడ్‌తోపాటు బండరాళ్లతో అశోక్ తలపై కనుకయ్య బలంగా కొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. పదేళ్లుగా తన భార్యతో అశోక్ వివాహేతర సంబంధం పెట్టుకున్నాడన్న అనుమానంతో కనుకయ్య ఈ హత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, నలుగురు కూతుళ్ల ఉన్నారు. మృతుడి కూతురు జేజేల శారద ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బైక్‌ను ఢీకొట్టిన కారు ..ఒకరికి తీవ్ర గాయాలు

మల్యాల, ఆగస్టు 18: జగిత్యాల-కరీంనగర్ మార్గంలోని నూకపల్లి వరదకాలువ బ్రిడ్జి వద్ద మహారాష్ట్ర నుంచి ద్విచక్రవాహనంపై వస్తున్న ఓ వ్యక్తిని కారు ఢీకొట్టడంతో తీవ్ర గాయాల పాలు అయ్యాడు. కారు ఢీకొని వేగంగా ముందుకు దూసుకెళ్లగా పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా పట్టుకున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం గూడెంకు చెందిన జనగాం బాలగౌడ్ అనే వ్యక్తి మహారాష్ట్ర నుంచి తన ద్విచక్రవాహనంపై తన స్వగ్రామం గూడెంకు వస్తుండగా వరదకాలువ బ్రిడ్జి వద్ద కారు ఢీకొట్టి వెళ్లింది. దీంతో కింద పడిన అతని ఎడమ కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వ్యక్తిని స్థానికులు చికిత్స కోసం జగిత్యాలకు 108లో తరలించారు. ఢీకొని వెళ్లిన కారు కోసం ఎస్సై నరేష్‌కుమార్, పోలీసులు సీసీ కెమెరాల ఫుటేజీలు పరిశీలించారు. రెండు గంటల వ్యవధిలోనే వేములవాడ సమీపంలో కారును పట్టుకున్నారు. కారును స్వాధీనం చేసుకొని కారు నడిపిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పురుగుల మందు తాగి యువతి ఆత్మహత్య

వేములవాడ రూరల్, ఆగస్టు 18: పురుగుల మందు తాగి యువతి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం చెక్కపల్లి గ్రామానికి చెందిన గీస శిరీష (20) డిగ్రీ పూర్తి చేసుకుని ఇంట్లో కుట్టుమిషన్ పనులు చేసుకుంటుంది. ఆదివారం ఉదయం గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన కుటుంబసభ్యులు హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. చికిత్సపొందుతూ శిరీష ఆదివారం రాత్రి మృతి చెందింది. శిరీష తండ్రి గీస లచ్చయ్య జీవనోపాధికై గల్ఫ్‌కు వెళ్లాడు. గ్రామానికి చెందిన ఇద్దరు యువకుల వేధింపుల వల్లే తన చెల్లి ఆత్మహత్య చేసుకుందని మృతురాలి అన్నయ్య గీస శ్రీకాంత్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

రెండేళ్ల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయిన వ్యక్తి

- గుర్తించిన పోలీసులు

కోనరావుపేట, ఆగస్టు 18: రెండు సంవత్సరాల క్రితం ఇంటి నుండి వెళ్లిపోయిన వ్యక్తిని ఆదివారం గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించినట్లు సీఐ వేంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. సీఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. కోనరావుపేట మండలం గోవిందరావుపేట తాండకు చెందిన బానోతు నరేష్ అనే వ్యక్తి 2022 సంవత్సరంలో కుటుంబ సమస్యల కారణంగా ఎవరికి చెప్పకుండా ఇంటి నుండి వెళ్లి పోయాడు. ఈ విషయమై కుటుంబ సభ్యులు కోనరావుపేట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్‌ఐ కేసు నమోదు చేసి దర్యాప్తులో భాగంగా నరేష్ గురించి ఎలాంటి ఆచూకీ తెలవకపోవడంతో చందుర్తి సర్కిల్ సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఎస్‌ఐ శేఖర్ రెడ్డి సిబ్బందితో టీం ఏర్పాటు చేసి సాంకేతికత ఆధారంగా హైదరాబాద్‌లో ఓ హోటల్‌లో పని చేస్తున్నాడని తెలుసుకొని అక్కడికి సీఐ వెంకటేశ్వర్లు సిబ్బందిని పంపించి సమాచార సేకరించారు. బానోతు నరేష్‌తో సీఐ మాట్లాడగా తన కుటుంబ కలహాలు వల్ల ఇంటి నుంచి వెళ్లిపోయానని తెలిపాడు. సీఐ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ శేఖర్‌రెడ్డిని ఎస్పీ అభినందించారు.

కొండగొర్రె మాంసం స్వాధీనం

గంభీరావుపేట, ఆగస్టు 18: గంభీరావుపేట మండలం కొత్తపల్లి గ్రామ శివారు ప్రాంతంలో కొండ గొర్రెను చంపిన ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ కల్పనదేవి ఆదివారం తెలిపారు. అటవీ ప్రాంతంలో బండలు కొడుతున్న షరీఫ్, యాకూబ్ అనే వ్యక్తులు అటుగా వెళుతున్న కొండగొర్రెను రాళ్లతో కొట్టి చంపేశారు. చనిపోయిన కొండ గొర్రెను వండుకునే సమయంలో డీఆర్‌వో అంజలి పక్కా సమాచారంతో సిబ్బందితో వెళ్లి గొర్రె తలకాయ, కాళ్లు, మాంసాన్ని స్వాధీనం చేసుకుని వారిని అదుపులోకి తీసుకున్నారు. కొండ గొర్రెను చంపిన వారిని పట్టుకున్న డిప్యూటీ రేంజ్ అధికారి అంజలి, బీట్ ఆఫీసర్ రమేష్‌ను ఎఫ్‌ఆర్‌వో అభినందించారు. షరీఫ్, యాకూబ్‌లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఎఫ్‌ఆర్‌వో కల్పనదేవి తెలిపారు.

శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి కొనసాగుతున్న ఎత్తిపోతలు

పెద్దపల్లి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి మిడ్ మానేరులోకి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. ఆదివారం సాయంత్రం వరకు ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి 8791 క్యూసెక్కుల వరద నీరు వస్తుండగా నంది, గాయత్రి పంప్‌హౌస్‌ల ద్వారా మిడ్ మానేరులోకి రెండు మోటార్ల ద్వారా 6300 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నారు. ఎన్టీపీసీకి, హైదరాబాద్, ఆయా నియోజకవర్గాల ప్రజల తాగునీటి అవసరాల కోసం 452 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 14.560 టీఎంసీల నీళ్ల ఉన్నాయి.

- మిడ్ మానేరు నుంచి..

బోయినపల్లి: మిడ్ మానేరు ప్రాజెక్టులోకు ఎల్లంపల్లి నుంచి గాయత్రి పంప్ హౌస్ ద్వారా 6,300 క్యూసెక్కుల, మూల వాగు నుంచి 2930 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 318 మీటర్ల గాను ప్రస్తుతం 312.65 ఉండగా, నీటి నిల్వ సామర్థ్యం 27.54 టీఎంసీలకు గాను ప్రస్తుతం 15.76 టీఎంసీల మేరకు నీరు నిల్వ ఉంది. కాగా మిడ్ మానేరు నుంచి అన్నపూర్ణ రిజర్వాయర్ కు 3200, కుడి కాలువకు వంద క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు.

- 'అన్నపూర్ణ'లోకి..

ఇల్లంతకుంట: ఇల్లంతకుంట మండలం అనంతగిరి గ్రామసమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌లో నీటి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. 3.5టీఎంసీల సామర్థ్యం ఉన్న రిజర్వాయర్‌లో 2.14 టీఎంసీల నీరు చేరింది. మధ్యమానేరు ద్వారా 3,200 క్యూసెక్కుల నీటిని ఒక పంపు ద్వారా ఎత్తిపోస్తున్నారు. అన్నపూర్ణ రిజర్వాయర్ నుంచి ఎగువన ఉన్న రంగనాయకసాగర్‌కు 3,300క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

గురుకులంలో సీటు ఇప్పిస్తానని మోసగించిన ఒకరిపై కేసు

మేడిపల్లి, ఆగస్టు 18: తన మిత్రుడికి ఎమ్మెల్యే తెలుసు అని నీ కొడుకుకు గురుకుల పాఠశాలలో సీటు ఇప్పిస్తానని చెప్పి మహిళ దగ్గర నుంచి రూ 35 వేలు తీసుకుని మోసగించిన వ్యక్తిపై పోలీసులు కేసమోదు చేశారు. మేడిపల్లి మండలం రాజలింగంపేట గ్రామానికి చెందిన రేగుల రాజేందర్ అనే వ్యక్తి అదే గ్రామానికి చెందిన మహిళ కొడుకుకు వేములవాడ గురుకుల పాఠశాలలో సీటు ఇప్పిస్తానని రూ 35 తీసుకున్నాడు. తన మిత్రుడైన చందూర్తి మండలం కిష్టపేట గ్రామానికి చెందిన చిగురుల మల్లేశం ఎమ్మెల్యే ఆదిశ్రీనివాస్‌కు దగ్గర అని చెప్పి ఇద్దరు కలిసి మహిళ దగ్గర నుంచి డబ్బులు తీసుకున్నారు. కాగా ఆ తరువాత గురుకుల పాఠశాలలో ఫ్రీ సీటు వచ్చిందని తెలుసుకుని తనను మోసం చేశారని మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై శ్యామ్‌రాజ్ తెలిపారు.

మోరపల్లి బస్సు ఘటన పై కేటీఆర్ ట్వీట్

జగిత్యాలరూరల్, ఆగస్టు 18: జగిత్యాల రూరల్ మండలం చల్‌గల్- మోరపల్లి గ్రామ శివారుల మధ్యలో జరిగిన బస్సు ప్రమాదం పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఎక్స్ వేదికగా ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. 50 మంది ప్రయాణించాల్సిన బస్సులో 170 మంది ఎక్కారని, దాంతో మోరపల్లి వద్ద నిర్మల్ డిపో బస్సులో 170 మంది ప్రయాణిస్తున్న బస్సు వెనుక రెండు టైర్లు ఊడిపోయాయని, ఈ ప్రమాదంలో ఎవరు గాయపడకపోవడం అదృష్టమే అన్నారు. ఈసందర్భంగా ఆయన ప్రభుత్వాన్ని ఘాటుగా విమర్శించారు. ఎందుకు అమాయక పౌరుల జీవితాలతో ఆడుకుంటున్నారని, బస్సుల సంఖ్యను పెంచాలని ఎప్పుడు ఆలోచిస్తారని, ప్రయాణికుల సంఖ్యను పరిమితం చేసే విషయంలో ఏదైనా భద్రత ప్రోటోకాల్ అనుసరిస్తున్నారా, అధికపనిచేసే డ్రైవర్లు, కండక్టర్లకు మీరు ఎలా పరిహారం చెల్లిస్తున్నారని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.



సోషల్‌మీడియా వేదికగా కేటీఆర్ చేసిన పోస్ట్

బిల్డింగ్ పైనుంచి పడిన బాలుడు చికిత్స పొందుతూ మృతి



ప్రజ్వల్(ఫైల్)

వేములవాడ టౌన్, ఆగస్టు 18: బిల్డింగ్‌పై నుంచి పడి తలకు తీవ్రగాయాలైన బాలుడు చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. గ్రామస్థుల వివరాల ప్రకారం వేములవాడ మండలం ఆరెపల్లి గ్రామానికి చెందిన నడిగొట్ల రాజేష్, లావణ్య దంపతుల కుమారుడు ప్రజ్వల్ (4) అనే బాలుడు నాలుగు రోజుల క్రితం కరీంనగర్‌లో తాము నివాసం ఉంటున్న బిల్డింగ్ పైనుంచి ప్రమాదవశాత్తు పడిపోయాడు. దీంతో కింద వున్న ఇనుప సీకులపై పడటంతో బాలుడి తలలో గుచ్చుకుని తీవ్రగాయాలయ్యాయి. వెంటనే చికిత్స నిమిత్తం హైదారాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు.

● ఆరెపల్లిలో విషాదం..

వేములవాడ మండలం ఆరెపల్లి గ్రామానికి చెందిన ప్రజ్వాల్ చికిత్స పొందుతూ మృతి చెందడంతో గ్రామంలో విషాదచాయలు అములుకున్నాయి. బాలుడి చికిత్స కోసం రూ 20 లక్షల ఖర్చు అవుతాయని సోషల్ మీడియాలో వైరల్ కావడంతో దాతలు స్పందించి విరాళాలు అందించారు. బాలుడి చికిత్స కోసం ఇప్పటి వరకు రూ 8 లక్షల వరకు ఖర్చు అయినట్లు బాధితులు తెలిపారు. కొడుకు మృతి చెందడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.

మరణిస్తూ ఐదుగురికి ప్రాణదానం

- రోడ్డు ప్రమాదంలో యువకుడి బ్రెయిన్‌డెడ్ - అవయవదానానికి కుటుంబసభ్యుల అంగీకారం

గంభీరావుపేట, ఆగస్టు 18: గంభీరావుపేట మండలం నర్మాలకు చెందిన ద్యానబోయిన నరేష్(27) రోడ్డు ప్రమాదానికి గురై బ్రెయిన్ డెడ్ అయ్యాడు. అవయవదాన ప్రాధాన్యాన్ని హైదరాబాద్ జీవన్ దాన్ సంస్థ, అపోలో వైద్యులు అవగాహన కల్పించారు. దీంతో పుటెడు దుఖంలో అవయవ దానం చేసేందుకు ఆ యువకుడి తల్లి అంగీకరించింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గంభీరావుపేట మండలం నర్మాలకు చెందిన ద్యానబోయిన నర్సింలు, దేవలక్ష్మి దంపతులకు నరేష్, నవిత ఇద్దరు సంతానం. రెండేళ్ల కిందట నర్సింలు అనారోగ్యంతో మృతి చెందాడు. కుటుంబ భారం కొడుకు నరేష్ మీద పడటంతో తల్లిని, చెల్లిని వదిలి ఏడాది కిందటే గల్ఫ్ బాట పట్టాడు. చెల్లి పెళ్లి చేసి, తాను పెళ్లి చేసుకుంటానని ఇటీవలనే ఇంటికి వచ్చాడు. లింగన్నపేటలో తన మేనమామ మృతి చెందగా, లింగన్నపేటకు వెళ్లి వస్తూ ఈ నెల 13న రైస్‌మిల్ వద్ద నరేష్(27) రోడ్డు ప్రమాదానికి గురై తీవ్రగాయాలపాలయ్యాడు. ముందుగా ఎల్లారెడ్డిపేట అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని అపోలో ఆసుపత్రికి తరలించారు. ఆరు రోజులుగా మృత్యువుతో పోరాడి శనివారం నరేష్ బ్రెయిన్ డెడ్ అయ్యాడు. జీవన్ దాన్ అవయవ దానం గురించి అవగాహన కల్పించగా నరేష్ తల్లి అవయవ దానానికి అంగీకరించింది. నరేష్ కళ్లు, గుండె, కాలేయం, ఊపిరితిత్తులు,



నరేష్ శవపేటిక వద్ద రోదిస్తున్న బంధువులు(ఇన్‌సెట్‌లో నరేష్(ఫైల్)

మూత్రపిండాలను దానం చేసి ఐదుగురి జీవితాల్లో వెలుగులు నింపాడు. దీంతో తన కొడుకు భౌతికంగా లేపోయినా ఐదుగురికి పునర్జన్మ కల్పించిన ఆ మాతృమూర్తిని పలువురు అభినందించారు.

తీవ్ర గాయాలతో బ్రెయిన్‌డెడ్

● అవయవదానం చేసిన కుటుంబసభ్యులు



నరేందర్(ఫైల్)

మల్యాల: ఎదురెదురుగా ద్విచక్రవాహనాలు ఢీకొన్న సంఘటనలో తీవ్రంగా గాయపడిన ఓ వ్యక్తి బ్రెయిన్‌డెడ్ కావడంతో కుటుంబసభ్యులు మృతుడి అవయవాలు దానం చేశారు. మల్యాల మండలం మద్దుట్లకు చెందిన ముస్కెల నరేందర్ (51)అనే రైతు తన వ్యవసాయ పొలం వద్దకు ద్విచక్రవాహనంపై వెళ్లి వస్తుండగా ఎదురుగా వస్తున్న మరో ద్విచక్రవాహనం ఢీకొన్నాయి. దీంతో నరేంద ర్ తల, ముఖం తదితర చోట్ల తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స కోసం జగిత్యాలకు తరలించారు. అక్కడి నుంచి కరీంనగర్, హైదరాబాద్ తీసుకెళ్లారు ముఖం, దవడలకు తీవ్ర గాయాలు కాగ శస్త్ర చికిత్సలు చేశారు. తలకు అయిన తీవ్ర గాయాలతో రెండు రోజుల క్రితం బ్రెయి న్‌డెడ్ అయింది. దీంతో హైదరాబాద్‌లోని యశోధ ఆసుపత్రిలో కుటుంబసభ్యులకు అవయవదానంపై వివరించడం తో శనివారం రాత్రి కుటుంబసభ్యులు నరేందర్ కిడ్నీలు, గుండె, ఊపిరితిత్తులను దానం చేశారు. ఆదివారం మృతదేహం మద్దుట్లకు రాగ అంత్యక్రియలు పూర్తి చేశారు. మృతుని కుటుంబసభ్యులను కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ పరామర్శించారు

ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న జయంతి


ఖనిలో కేక్ కట్ చేస్తున్న గౌడ సంఘం నాయకులు


మంథనిలో నివాళులర్పిస్తున్న పుట్ట మధు


పెద్దబొంకూరులో సర్వాయి పాపన్న జయంతి వేడుకలు

కళ్యాణ్‌నగర్, ఆగస్టు 18: గోదావరిఖనిలో ఆదివారం సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మెయిన్ చౌరస్తాలో పాపన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అరాచక పాలనలో వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న వారి పట్ల అధిక పన్నులు వేయడం, ఆడవారిపై అఘాయిత్యాలు చేయడాన్ని సహించలేని పాపన్న ఇతర కులాలకు చెందిన మిత్రులతో వారిపై ఎదురు తిరిగి సైన్యాన్ని తయారు చేశారన్నారు. కోటలను కొల్లగొడుతూ చివరి గోల్కొండ కోటను వశపర్చుకున్న యోధుడని కొనియాడారు. రాబోయే కాలంలో గౌడ కులస్థులు ఇతర కులాలవారిని కలుపుకుని రాజ్యాధికారాన్ని సాధించే దిశగా అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. కోట రవి, గున్నాల శ్రీధర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకుడు మేరుగు హన్మంతుగౌడ్, వంగ శ్రీనివాస్, మండ రమేష్, బాలసాని స్వామి, రంగు రాజయ్య, తోడేటి శంకర్, మూల అశోక్, బందె నాగభూషణం, సురేందర్, గడ్డం రవి, పొన్నం లక్ష్మణ్, గోపగాని సతీష్ పాల్గొన్నారు.

మంథని : నిజాం నిరంకుశ పాలను ఎదిరించిన తెలంగాణ విప్లవ జ్వాల సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ పోరాట స్ఫూర్తి అందరికి ఆదర్శమని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు కొనియాడారు. సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతిని పురస్కరించుకొని ఆయన విగ్రహానికి పుట్ట మధు ఆదివారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిజాం రాజుకు ఎదురునిల్చి పోరాడి ఖిలాషాపూర్ కేంద్రంగా బహుజన రాజ్యాన్ని స్థాపించిన పోరాట యోధుడు పాపన్న వెల్లడించారు. బహుజను కష్టాసుఖాల్లో పాలుపంచుకొని వారిలో నిరంకుశ పాలన పట్ల పోరాట చైతన్యాన్ని నింపారన్నారు. పాపన్న స్ఫూర్తితోనే బహుజన వాదాన్ని అనుసరిస్తున్నట్లు తెలిపారు. తాడిత, పీడిత ప్రజల కోసం పోరాడి తమ జీవిత్యాలను త్యాగం చేసిన మహనీయుల చరిత్రను ప్రజలకు తెలియజేసేందుకే మంథనిలో మహనీయులందరి విగ్రహాలను ఏర్పాటు చేశామన్నారు. వారిని నిత్యం చూస్తూ స్ఫూర్తి పొందుతామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు తగరం శంకర్‌లాల్, ఏగోళపు శంకర్ గౌడ్, మాచీడి రాజుగౌడ్, బత్తుల సత్యనారాయణ, కుమార్‌లు పాల్గొన్నారు.

పెద్దపల్లి రూరల్ : పెద్దపల్లి మండలంలోని పెద్దబొంకూరు గ్రామంలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి వేడుకలను మిట్టపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వాయి పాపన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ సర్వాయి పాపన్న ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో మిట్టపల్లి శ్రీనివాస్, నిమ్మల మధునయ్య, కోట శ్రీనివాస్, కోట రాజమౌళి, తుదూరి చంద్రమౌళి, నిమ్మల లచ్చయ్య, నిమ్మల శ్రావణ్, గండి తిరుపతి, కొత్తూరి రాజయ్య, నిమ్మల సతీష్, శ్రీనివాస్, సది, అనిల్, శ్రీరామ్, అభిషేక్, అజిత్, వంశీ, పవన్, రవి, సురేష్, వెంకటేష్, రాజు, ఓదెలుతో పాటు పలువురు పాల్గొన్నారు.

సుల్తానాబాద్ : సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకలను స్థానిక గౌడ సంఘం నాయకులు ఘనంగా జరుపుకున్నారు. సుల్తానాబాద్ పట్టణంలోని పాత జెండా వద్ద ఏర్పాటు చేసిన సర్వాయి పాపన్న విగ్రహం వద్ద పాపన్న చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. కేక్ కట్ చేసి అందరికీ పంచారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అంతటి పుష్పలత అన్నయ్యగౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బుర్ర శ్రీనివాస్‌గౌడ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు వేగోళం అబ్బయ్యగౌడ్, తాళ్లపల్లి మనోజ్‌గౌడ్, అంజయ్య, పులి రమేష్, మంద శ్రీనివాస్‌గౌడ్, అంతటి లచ్చన్న, చిరంజీవి, రజక సంఘం అధ్యక్షుడు నిట్టూరి రాజేశం, ఆడెపు అంబదాసు, న్యాతరి ప్రభాకర్, తోడేటి రాములు, చేపూరి రవి, పొన్నం తిరుపతి, బత్తిని కృష్ణ, శ్రీనివాస్, సాగర్,ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు. నారాయణరావుపల్లిలో మాజీ ఎంపీటీసీ మొలుగూరి అంజయ్య, మాజీ సర్పంచ్ వెంకటలక్ష్మి తదితరుల ఆధ్వర్యంలో సర్వాయి పాపన్న జయంతి కార్యక్రమాలు నిర్వహించారు.


కమాన్‌పూర్‌లో నివాళులర్పిస్తున్న నాయకులు

రామగిరి : మండలంలోని పన్నూరు గ్రామంలో సర్వాయి పాపన్నగౌడ్ జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆరెల్లి కొంరయ్య ముఖ్యఅతిథిగా హాజరై పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా దేశానికి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో భూమయ్య, పెరమాండ్ల సతీష్‌గౌడ్, సమ్మయ్యగౌడ్, అవినాష్ గౌడ్, తాటి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎలిగేడు : మండలంలోని ఎలిగేడు, ధూళికట్ట గ్రామాల్లో ఆదివారం సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి వేడుకలు గౌడ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌక్‌లో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి,స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అడ్డగుంట శ్రీనివాస్‌గౌడ్, తిరుపతిగౌడ్, మండిగ రాజనర్సు, కోరుకంటి వెంకటేశ్వర్ రావు, కవ్వంపల్లి స్వామి, బూర్ల వెంకటసత్యం, బుర్ర రాజు, గణేష్, రవిగౌడ్, బత్తిని శ్రీనివాస్‌గౌడ్, తిరుపతి, డీలర్ రాజయ్య, పడాల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్ : బహుజన వీరుడు సర్వాయి పాపన్నగౌడ్ అని, అతని అడుగుజాడల్లో ప్రతి ఒక్కరు నడువాలని సర్వాయి పాపన్న గౌడ్ సంఘం రాష్ట్ర నాయకులు మాజీ ఎంపీపీ గోపగోని సారయ్యగౌడ్ అన్నారు. ఆదివారం మండలంలోని పెగడపల్లి, కాల్వశ్రీరాంపూర్, గంగారం గ్రామాలతో పాటు ఆయా గ్రామాల్లో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలు గౌడ సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సారయ్యగౌడ్‌తో పాటు నూనేటి మాజీ ఎంపీపీ సంపత్ యాదవ్, మాజీ జడ్పీటీసీ వంగల తిరుపతి రెడ్డి హాజరై సర్వాయి పాపన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ బడుగు బలహీనవర్గాల అభ్యున్నతి కోసం పాటుపడిన మహోన్నత వ్యక్తి సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ అని అన్నారు. ఔరంగజేబును ఓడించి గోల్కొండ కోటను జయించిన ధీరుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ అని వారు కొనియాడారు. ఆయన ఆశయ సాధన కోసం పని చేస్తూ ఆశయాలను నెరవేర్చడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘాల నాయకులు, వివిధ కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కమాన్‌పూర్ : సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకలను మండల కేంద్రంలో అంగడి బజారులో ఆదివారం సర్దార్ సర్వాయి పాపన్న మొక్కుదెబ్బ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్దార్ సర్వాయి పాపన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న బహుజనుల అభ్యున్నతికి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు నగునూరి నర్సయ్య గౌడ్, డివిజన్ అధ్యక్షుడు రంగు సత్యనారాయణగౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోల నర్సాగౌడ్, వివిధ సంఘాల, రాజకీయ నాయకులు బోనాల వెంకటస్వామి, పిల్లి చంద్రశేఖర్, గడప కృష్ణమూర్తి, మచ్చగిరి రాము, గాండ్ల మోహన్, కుక్క చంద్రమౌళి, రఫీక్, మల్యాల తిరుపతి, రంగు శ్రీనివాస్ గౌడ్, గర్రెపల్లి వెంకన్న, అనవేన లక్ష్మీరాజం, కోలేటి శివ, చింతపండు మధు, మల్యాల సతీష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


సుల్తానాబాద్‌లో నివాళులర్పిస్తున్న నాయకులు


కాల్వశ్రీరాంపూర్‌లో..


రామగిరిలో..

వైభవోపేతంగా ముగిసిన చండీ మహాయాగం

- చివరి రోజు భారీగా తరలివచ్చిన భక్తులు


చండీయాగంలో పాల్గొన్న దంపతులు

సిరిసిల్ల, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): లలితాపరమేశ్వరి లక్ష్మీనారాయణ ఉమామహేశ్వర సహిత శివభక్త మార్కండేయస్వామి ఆలయంలో ఎంతో వైభవోపేతంగా నాలుగు రోజుల పాటు చండీ మహాయాగం నిర్వహించారు. చివరిరోజు ఆదివారం చండీ మహాయాగానికి, చండీమాత దర్శనానికి పెద్దఎ త్తున భక్తులు తరలివచ్చారు. చండీయాగాన్ని మళయాళస్వామి లక్ష్మీనారా యణ ఆశ్రమం పరమాత్మనంద గిరిస్వామి పర్యవేక్షణలో నిర్వహించారు. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కే తారకరామారావులతో పాటు ప్రముఖులు, ప్రజా ప్రతినిధులు చండీమాతను దర్శించుకున్నారు. చండీయాగం ముగింపు సంద ర్భంగా మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. యాగంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళచక్రపాణి, టెక్స్‌టైల్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, మున్సిపల్ వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్, పద్మశాలీ సంఘం అధ్యక్షుడు గోలి వెంకటరమణ, పత్తిపాక సురేష్, మండల సత్యం, గాజుల బాలయ్య, తదితరులు పాల్గొన్నారు.



కార్మికుల సమస్యలపై పోరాటాలు

మందమర్రిటౌన్, ఆగస్టు 18: కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేస్తామని సీఐటీయూ మందమర్రి బ్రాంచ్ కార్యదర్శి వెంకటస్వామి, అల్లిరాజేందర్ తెలిపారు. ఆదివారం మందమర్రిలో వారు మాట్లాడుతూ కార్మికుల సమస్యలను పరిష్కరించకుండా యాజమాన్యం నిర్లక్ష్యం చేస్తోందన్నారు. సమస్యల పరిష్కారం కోసం ఈనెల 20 నుంచి 28వరకు పోరాట కార్యక్రమాలను చేపట్టనున్నట్లు తెలిపారు. అనంతరం కార్యక్రమాల పోస్టర్లను విడుదల చేశారు.

'మైనింగ్ స్టాఫ్ సమస్యలను పరిష్కరించాలి'

మందమర్రిటౌన్, ఆగస్టు 18: సింగరేణిలో ఉత్పత్తి ఉత్పాదకతలో కీలకపాత్ర పోషిస్తున్న మైనింగ్‌స్టాఫ్ ఉద్యోగుల సమస్యలను యాజమాన్యం పరిష్కరించాలని ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య పేర్కొన్నారు. ఆదివారం ఏఐటీయూసీ కార్యాలయంలో నిర్వహించిన బెల్లంపల్లి, మందమర్రి, శ్రీరాంపూర్ మైనింగ్‌స్టాఫ్ సమావేశానికి హాజరై మాట్లాడారు. సింగరేణిలో ఈ మధ్యకాలంలో మైనింగ్‌స్టాఫ్‌ను ప్రతిదానికి బాధ్యులను చేయడం సరికాదన్నారు. మైనింగ్‌స్టాఫ్‌కు పాత పద్ధతిలోనే పదోన్నతులు కల్పించాలన్నారు. మైనింగ్ స్టాఫ్‌ను మరింత పటిష్టం చేయడానికి కమిటీలను ఎన్నుకుంటామన్నారు. సమావేశంలో యూనియన్ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ మిర్యాల రంగయ్య, సీనియర్ నాయకులు చిప్ప నర్సయ్య, బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, దాగం మల్లేష్‌లింగయ్య, మైనింగ్ స్టాఫ్ నాయకులు పాల్గొన్నారు.

క్రీడల్లో పాల్గొనడం అభినందనీయం: జీఎం

శ్రీరాంపూర్, ఆగస్టు 18: ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తూనేక్రీడల్లో పాల్గొనడం అభినందనీయమని శ్రీరాంపూర్ ఏరియా జీఎం బి సంజీవరెడ్డి అన్నారు.కృష్ణకాలనీలోని శాంతిమైదానంలో ఆర్కే-5గనికి చెందిన ఉద్యోగులు ఆదివారం స్నేహపూర్వక క్రికెట్‌మ్యాచ్ ఆడారు. ఈ మ్యాచ్‌ను జీఎం ప్రారంభించి మాట్లాడారు. క్రీడలతో మానసికోల్లాసం, దేహదారుఢ్యం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో శ్రీరాంపూర్ ఉపరితల గని ప్రాజెక్ట్ అధికారి టి శ్రీనివాస్, గనిమేనేజర్ అబ్దుల్ ఖాదిర్, డాక్టర్ లోక్‌నాథ్‌రెడ్డి, వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

'అధికారుల నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణం'

రెబ్బెన, ఆగస్టు 18: బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి సీహెచ్‌పీలో శనివారం జరిగిన ప్రమాదానికి అధికారుల నిర్లక్ష్యమే కారణమని ఏఐటీయూపీ బెల్లంపల్లిరీజియన్ అధ్యక్షుడు ఉపేందర్ ఆరోపించారు. ఆదివారం స్థానికంగా ఆయన మాట్లాడారు. పర్మినెంటు ఉద్యో గులు చేయాల్సిన పనిని కూడా కాంట్రాక్టు కార్మికుల తో యాజమాన్యం చేయిస్తోందన్నారు. సీహెచ్‌పీలో బంకర్ వద్ద బెల్టు క్లీనింగ్ చేస్తుండగా ప్రమాదం జరిగి కార్మికుడికి గాయాలైనట్లు వివరించారు. సమావేశంలో కార్మిక సంఘ నేతలు సాగర్ గౌడ్, రాజశేఖర్ తదితరులున్నారు.

రాజన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు


భక్తులతో సందడిగా మారిన ఆలయ ప్రాంగణం

వేములవాడ కల్చరల్, ఆగస్టు 18: వేములవాడ రాజన్నకు భక్తులు మొక్కులు చెల్లించుకునేందుకు బారులు తీరారు. శ్రావణ మాసం రెండో ఆదివారం కావడంతో భక్తులు పెద్దసంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. ధర్మదర్శనం, శీఘ్రదర్శనం, బ్రేక్‌దర్శనం క్యూలైన్‌లో భక్తులు ఆలయంలోకి ప్రవే శించి రాజన్నకు అత్యంత ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకుని పార్వతి పరమేశ్వరులను దర్శించుకుని తరించారు. రాజన్న ఆలయానికి సుమారుగా 20 వేలకుపైగా భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయా ధికారులు అంచనా వేస్తున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఈవో వి నోద్‌రెడ్డి ఆదేశాలతో ఏఈవోలు బ్రహ్మన్నగారి శ్రీనివాస్, రమేష్‌బాబు, సూపరింటెండెంట్ తిరుపతిరావు, రాజన్‌బాబు, సీనియర్ అసిస్టెంట్ ఎడ్ల శివసాయిలు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రాజన్నను దర్శించుకున్న మహారాష్ట్ర రవాణా కమిషనర్

రాజరాజేశ్వరస్వామి వారిని మహారాష్ట్ర రవాణా కమిషనర్ వివేక్ భీమనవర్ ఆదివారం దర్శించుకున్నారు. కుటుంబసభ్యులతో కలిసి రాజన్న ఆలయానికి తరలివచ్చి స్వామివారి సేవలో పాల్గొన్నారు. అనంతరం ఆలయ నాగిరెడ్డి మండపంలో అర్చకులు ఆశీర్వచనం గావించగా ఆలయ ఏఈవో రమేష్‌బాబు, సూపరింటెండెంట్ తిరుపతిరావు రాజన్నప్రసాదాన్ని అందజేశారు.


రాజన్నను దర్శించుకుంటున్న భక్తులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


సమ్మేళనంలో పాల్గొన్న శ్రీరామ విద్యాలయం విద్యార్థులు

కోల్‌సిటీటౌన్, ఆగస్టు 18: గోదావరిఖని విద్యానగర్‌లోని శ్రీరామ విద్యాలయం పదో తరగతి 1999-2000 బ్యాచ్‌కి చెందిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల వ్యవస్థాపకులు హెచ్‌ఎం పిట్టల రాజేందర్‌కు ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం పూర్వ విద్యార్థులు చిననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. చదువు చెప్పిన గురువులు పద్మావతి, భాగ్యలక్ష్మి, ఉమాదేవి, జయశ్రీ, జ్యోతి, బి.సరోజనలను సన్మానించారు.

రేపు ఆయుర్వేద వైద్య శిబిరం

వైటింక్లయిన్‌కాలనీ, ఆగస్టు 18: మాతా రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆయుర్వేద సౌజన్యంతో మంగళవారం కాలనీలో వైద్యం శిబిరం ఏర్పాటు చేసినట్టు ఆర్జీ-2 అధికార ప్రతినిధి రాజేంద్రప్రసాద్ ప్రకటనలో పేర్కొన్నారు. సీఈఆర్ క్లబ్‌లో ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఆయుర్వేద నిపుణులు విశ్వనాథ మహర్షి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్టు తెలిపారు. కాలనీ ప్రజలు, ఉద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాజేంద్రప్రసాద్ ప్రకటనలో పేర్కొన్నారు.

ఆదివరాహస్వామికి భక్తుల వెండి తొడుగు


భక్తులు అందించిన వెండి తొడుగు

కమాన్‌పూర్, ఆగస్టు 18: కమాన్‌పూర్ మండల కేంద్రంలోని ఆది వరాహస్వామికి భక్తులు వెండి తొడుగును అందజేశారు. కమాన్‌పూర్ మండల కేంద్రానికి చెందిన కోలేటి నాగభూషణం ఒక కిలో వెండి, ముత్యాల దామోదర్, బిల్ల నాగయ్య, పిన్న శ్రీనివాస్, సుధీర్, పొలాల సత్యనారాయణ, కొలిపాక వెంకటేశ్వర్లు, ఘనపురం వేణు, మాచిడి రాజు, గుండా కిరణ్, సింగరేణి సీఎండీ బలరాంనాయక్ సతీమణి శారద, సింగరేణి డైరెక్టర్ సతీమణి కళ్యాణి తదితరులు సుమారు 6కిలోల వెండి తొడుగును అందజేశారు. అలాగే ఈ వెండి తొడుగును ఆలయ ఈఓ గోసాల కాంతరెడ్డి ఆధ్వర్యంలో స్వామివారికి తొడిగారు.

బాధిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే పరామర్శ

సుల్తానాబాద్, ఆగస్టు 18: కొన్ని రోజుల క్రితం అకాల మరణం పొందిన సుల్తానాబాద్‌కు చెందిన భైరగోని బక్కయ్య కుటుంబ సభ్యులను ఆదివారం పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి పరామర్శించారు. బక్కయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పంచారు. కుటుంబ సభ్యులకు సానుభూతి సంతాపం తెలిపారు. ఆయన వెంట పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షులు పారపల్లి గుణపతి, నాయకులు సర్వర్, మధుసూదన్‌రెడ్డి, ఎల్లయ్య, మహ్మద్ రఫిక్, విజయ్ తదితరులు ఉన్నారు.

ఒగ్గుడోలు కళాకారులకు సత్కారం


కళాకారులను సన్మానిస్తున్న నిర్వాహకులు

మంథని, ఆగస్టు 18: మండలంలోని నాగారం గ్రామానికి చెందిన ఒగ్గుడోలు కళాకారులు కావటి భూమయ్య యాదవ్, కావేటి శ్రీశైలం యాదవ్‌లను తిరుపతిలోని మాస్ అసోసియేషన్ ఫర్ రూరల్ పూర్ (ఎంఏఆర్‌పీ) ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సత్కరించారు. దేశ స్వాతంత్ర్య వేడుకలను పురస్కరించుకొని తిరుపతిలోని విశ్వం హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో అంతరించి పోతున్న ఒగ్గు డోలు కళను రక్షిస్తున్నందుకు తలంగాణ శ్రీమల్లఖార్జునస్వామి యాదవ ఒగ్గు పూజారుల సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కావటి భూమయ్య యాదవ్‌ను, అయన తనయుడైన వారిని అసోసియేషన్ వారు శాలువాలు, మోమెంటోలతో ఘనంగా సన్మానించారు. వీరిని సత్కరించడం పట్ల గ్రామస్థులు, ఒగ్గు డోలు కళాకారులు హర్షం వ్యక్తం చేశారు.

కళా భవనం నిర్మాణానికి రూ.5కోట్లు కేటాయించాలి

-ముఖ్యమంత్రిని కోరిన కార్పొరేటర్

కోల్‌సిటీ, ఆగస్టు 18: గోదావరిఖనిలో కళాభవన నిర్మాణానికి రూ.4కోట్లు కేటాయించాలని కాంగ్రెస్ కార్పొరేటర్ పులేందర్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. ఆదివారం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్‌తో కలిసి ముఖ్యమంత్రిని కలిసిన ఆయన ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. కార్పొరేషన్‌కు కేటాయించిన రూ.100 కోట్ల నుంచి కళాభవనానికి నిధులు కేటాయించాలని ఆయన కోరారు. దీనిపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించిన ఆయన పేర్కొన్నారు.

బీసీ సదస్సును విజయవంతం చేయాలి


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న బీసీ సంఘం నాయకులు

కాల్వశ్రీరాంపూర్, ఆగస్టు 18: పెద్దపల్లిలో మంగళవారం జరిగే బీసీ సదస్సుకు మండలంలోని బీసీ కులస్థులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని మాజీ ఎంపీపీ నూనేటి సంపత్‌యాదవ్ పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలో బీసీ నాయకులు పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంపత్‌యాదవ్ మాట్లాడుతూ తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు 42శాతం రిజర్వేషన్లు పెంచుతామని ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ బీసీలకు ఇచ్చిన కామారెడ్డి డిక్లరేషన్‌కు కట్టుబడి, బీసీ కులగణన చేసిన తరువాతనే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. బీసీ హక్కుల కోసం పెద్దపల్లిలోని ఎంబీగార్డెన్లో జరిగే సమావేశానికి మండలంలోని అన్ని బీసీ సంఘాల నాయకులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. అనంతరం సర్వాయిపాపన్నగౌడ్ జయంతి సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. ఈ కార్యక్రమంలో జేఎన్‌టీయూ రాష్ట్ర కన్వీనర్ ఆకుల స్వామి వివేక్ పటేల్, నాయకులు కొట్టె రవీందర్, జెట్టి దేవేందర్, నిదానపురం దేవయ్య, ఆశాడపు రాజయ్య, నూనేటి కుమార్, ఒడ్నాల శ్రీనివాస్, మర్రి మహేందర్, మాదాసి శంకర్, మేర్గవేన కుమార్, అల్లంల రవి, కొలగాని కిరణ్, సతీశ్, కూకట్ల నవీన్, ఆశాడపు సారయ్య, ఉమ్మల్ల రాయమల్లు పాల్గొన్నారు.